ప్రజాశక్తి
మంగళవారం 3 సెప్టెంబర్ 2024 5 విజయనగరం



టాస్క్ ఫోర్స్ సిఐగా వెంకటరావు



ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో టాస్క్‌ఫోర్స్ సిఐగా బి.వెంకటరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. మొన్నటివరకూ వన్‌టౌన్ సిఐగా విధులు నిర్వహించిన ఆయన ఇటీవల బదిలీల్లో హెడ్‌క్వార్టర్‌కు ఆయనను అటాచ్ చేశారు. తాజాగా టాస్క్‌ఫోర్సు సిఐగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా గంజాయి, అసాంఘిక కార్యకలాపాలు నియంత్రణకు కృషి చేయాలని సిఐకు ఎస్‌పి సూచించారు.

తక్షణమే కోర్టు తీర్పుల అమలు

- అర్జీదారులు కోరిన అంశంపై స్పష్టమైన సమాధానమివ్వాలి
- ఆర్థిక భారంతో ముడిపడని వినతులన్నీ పరిష్కారం కావాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఏదైనా అంశంపై కోర్టులు ఇచ్చిన తీర్పులను తక్షణమే అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జిల్లా అధికారులను ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి వివాదాలపై కోర్టులనుంచి వచ్చే నోటీసులకు నిర్ణీత గడువులోగా సమాధానాలు దాఖలు చేసే బాధ్యత ఆయా ప్రభుత్వ శాఖల అధికారులపైనే వుంటుందని స్పష్టం చేశారు. అన్ని శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు కోర్టు తీర్పులు, ఉత్తర్వుల పట్ల అప్రమత్తంగా వుంటూ జిల్లా యంత్రాంగానికి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకుండా స్పందించాలన్నారు. స్పందించడంలో అలసత్వం వహించే అధికారుల పట్ల తీవ్రమైన చర్యలు వుంటాయని స్పష్టంచేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలోను, మండలస్థాయిలోని తహశీల్దార్లు, ఎంపిడిఒలతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సోమవారం జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్జీదారులు వినతుల పరిష్కారం కోసం ఇచ్చే వినతులకు ఆయా అధికారులు స్పష్టమైన సమాధానాలు ఇవ్వకపోవడం వల్ల ఒక అంశంపై అర్జీదారులు పదేపదే వినతులు ఇస్తున్నారని, దీనిని నివారించాలని ఆదేశించారు. ఒకసారి అర్జీ ఇచ్చిన తర్వాత మళ్లీ అది రీఓపెన్ అయ్యే పరిస్థితి రాకూడదని స్పష్టంచేశారు. ఆర్థిక అంశాలతో ముడిపడని అన్ని సమస్యలు పరిష్కారం కావలసిందేనని చెప్పారు. భూ పంపకాలకు సంబంధించిన వివాదాలు, కుటుంబ సభ్యుల మధ్య వున్న ఆస్తుల వివాదాలను కోర్టుల ద్వారా పరిష్కరించుకోవాలనే అంశం అర్జీదారులకు తెలియజేయాలని తెలిపారు.

ఈ సందర్భంగా ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనకు ఉద్దేశించి నిర్వహించే జాబ్ మేళాల సమాచారంతో కూడిన జాబ్ క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ ఎస్.గోవిందరావు మాట్లాడుతూ జిల్లాలో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో సెప్టెంబరు 3 నుంచి డిసెంబరు 27వ తేదీ వరకు యీ జాబ్ మేళాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

కరాటే క్రీడాకారులకు అభినందన

తెలంగాణలోని కల్వకుర్తిలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మన రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించి పలు మెడల్స్ సాధించిన నగరంలోని పెదతాడివాడ మెర్సీ మిషన్ స్కూల్‌కి చెందిన కరాటే క్రీడాకారులను కలెక్టర్ అభినందించారు.

గ్రీవెన్సుకు 215 వినతులు

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదికకు 215 వినతులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు చెందినవి వినతులు 137 ఉన్నాయి. కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, డిఆర్ఒ అనిత, తదితర అధికారులు వినతులు స్వీకరించారు. ఆరు నెలలుగా తమకు జీతాలు రావడం లేదని వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ వెలుగు విఒఏలు వినతి అందజేశారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాలను తమకు విడుదల చేయాలని కోరుతూ చీపురుపల్లి ఆదర్శ డిగ్రీ కళాశాల విద్యార్థులు వినతిపత్రం ఇచ్చారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కోసం భూములు ఇచ్చిన ఎ.రావివలస, గూడెపువలస, కంచేరు తదితర గ్రామాల రైతులకు భూములకు నష్టపరిహారం నేటికీ చెల్లించలేదని ఎ.రావివలసకు చెందిన ఉప్పాడ శివారెడ్డి నేతృత్వంలో రైతులు కలెక్టర్‌కు వినతి ఇచ్చారు. తాటిపూడి జలాశయానికి స్వాతంత్ర్య సమరయోధుడు గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరు పునరుద్ధరణ చేయాలని కొప్పల వెలమ సేవా సంఘం నాయకులు కోరారు. విజయనగరంలో సుందరీకరణ పేరుతో అవినీతి జరిగిందని కళ్ల గౌరీశంకర్ వినతి అందజేశారు. విజయనగరం డిగ్రీ కళాశాల శాశ్వత భవనం ఏర్పాటు చేయాలని నియోజకవర్గం టిడిపి నాయకులు ఐవిపి రాజు, ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్ తదితరులు వినతినిచ్చారు.

తుపానుపై అప్రమత్తం

ఈనెల 6, 7 తేదీల్లో బంగాళాఖాతంలో మరో తుపాను ఏర్పడే అవకాశం ఉందని, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, నోడల్ అధికారులు అప్రమత్తంగా వుండాలని కలెక్టర్ ఆదేశించారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిసినట్లయితే జిల్లా నుంచి ప్రవహించే నదుల్లో వరద ప్రవాహం పెరిగే అవకాశం వుంటుందని, అందువల్ల వాటి పరిస్థితిని నిరంతరం గమనించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ అనిత, మెప్మా పీడీ సుధాకర్, డిఆర్‌డిఎ పిడి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

దద్దరిల్లిన కలెక్టరేట్

కలెక్టరేట్ సోమవారం ధర్నాలతో దద్దరిల్లింది. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని పాఠశాల శానిటేషన్ వర్కర్లు, విఒఎలు వేర్వేరుగా ధర్నాలు చేపట్టగా, అక్రమ తొలగింపులు ఆపాలని మధ్యాహ్న భోజన కార్మికులు ఆందోళన చేశారు. భారీ సంఖ్యలో శానిటేషన్ వర్కర్లు, విఒఎలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆయా యూనియన్ల నాయకులు కలెక్టరేట్‌కు చేరుకుని, ఆందోళనలు చేశారు. కార్మికుల నినాదాలతో కలెక్టరేట్ ప్రాంతమంతా మార్మోగింది.

– ప్రజాశక్తి, విజయనగరం టౌన్



ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, పాఠశాలల శానిటేషన్ వర్కర్లు

పాఠశాల శానిటేషన్ వర్కర్ల ధర్నా

5 నెలల బకాయి జీతాలు చెల్లించాలని, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఎపి పాఠశాలల అండ్ కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. నెలల తరబడి జీతాలు చెల్లించకపోతే ఎలా బతకాలని, ప్రభుత్వ సెలవు దినాలు అమలు కావడంలేదని, నెలలో రెండు రోజులైనా సిక్ లీవ్‌లు ఇవ్వకుండా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు పనిచేయిస్తున్నారని , పనిభారం తగ్గించాలని నినదిస్తూ కలెక్టరేట్ మెయిన్‌గేట్ వద్ద బైఠాయించారు. పోలీసులు జోక్య చేసుకొని డిప్యూటీ డిఇఒ, ఎఎలను తీసుకురావడంతో యూనియన్ నాయకులు బి.సుధారాణి, వి.లక్ష్మి, ఎ. జగన్మోహన్ రావు వినతి పత్రం ఇచ్చి సమస్యలను వివరించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ భీమిలిలో మాట్లాడుతూ 4 రోజుల్లో బకాయి జీతాలు చెల్లిస్తామని చెప్పారని , కొద్దిరోజులు సమయం ఇవ్వాలని, మీ సమస్యలను పై అధికారులకు, ప్రభుత్వానికి తెలియజేస్తామని హామీ ఇచ్చారు. రామభద్రపురం, మెంటాడ, ఎల్ కోట తదితర చోట్ల వర్కర్లను తొలగిస్తామని బెదిరిస్తున్నారని చెప్పగా, అలా జరగకుండా ప్రధాన ఉపాధ్యాయులతో మాట్లాడుతామని చెప్పారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాజకీయ కారణాలతో ఏ ఒక్క వర్కర్ ను తొలగించినా ఉద్యమిస్తామన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణమే జీతాలు చెల్లించాలని లేనిపక్షంలో అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున సామూహిక సత్యాగ్రహ దీక్ష చేపడతామని ప్రకటించారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి బి రమణ, జిల్లా కమిటీ సభ్యులు బలస శ్రీనివాసరావు, ముత్యాలు, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు నందిని, బేగం తదితరులు పాల్గొన్నారు.

విఒఎల బకాయి వేతనాలు చెల్లించాలి

విఒఎలకు 2024 మార్చి నెల నుండి బకాయి వున్న వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట విఒఎ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం స్పందించి బకాయి వేతనాలు చెల్లించాలని ఆర్థిక ఇబ్బందులు నుండి విఒఎ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. గత రెండు నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా విఒఎలు అక్రమ తొలగింపులకు, వేదింపులకు గురవుతున్నారు. వందలాది మందిని తొలగించారు. మరి కొంతమందిని తొలగించడానికి లిస్టులు తయారు చేసి ఉద్యోగం నుండి తొలగిపోవాలని వేదిస్తున్నారని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విఒఎల అక్రమ తొలగింపులకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎండిఎం కార్మికుల అక్రమ తొలగింపులు ఆపాలి

డెంకాడ హైస్కూల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు అక్రమ తొలగింపు ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, నాయకులు బి.సూర్యనారాయణ, రొంగలి రమణమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని డ్వాక్రా మహిళా సంఘం (భగవాన్ (గ్రూపు) సభ్యులైన రొంగలి రమణమ్మ ఆధ్వర్యంలో గత 20 సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్నారని, ఇటీవల మారిన రాజకీయ పరిస్థితుల ప్రభావంతో హెచ్ఎం పై ఒత్తిడి తీసుకొచ్చి అవాస్తవమైన ఆరోపణలను చేస్తూ ఆమెను తొలగించి వేరే వారిని నియమించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ మేరకు నోటీసు కూడా జారీ చేశారని పేర్కొన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా వాటిని భరిస్తూ కష్టపడి పనిచేస్తున్న వీరిని అక్రమంగా తొలగించడం అన్యాయమని అన్నారు. అనంతరం విద్యా శాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో మంగమ్మ, నారాయణమ్మ, పూడి లక్ష్మి కార్మికులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్ స్టూడెంట్స్ ఫెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్, ఎస్ఎఫ్ఐ నాయకులు

28 నుంచి భగత్‌సింగ్ స్టూడెంట్స్ ఫెస్ట్

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మత్తు పదార్థాలను నిర్మూలించాలి అనే నినాదంతో జిల్లావ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భగత్ సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ సంబంధించిన లోగోను ఎస్‌పి వకుల్ జిందాల్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ యువత డ్రగ్స్ మహమ్మారి బారిన పడకుండా సమాజం బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వీటిపై యువతకు అవగాహన కల్పించే విధంగా, అదే సందర్భంలో డ్రగ్స్ కి నిర్మూలన మార్గం కల్చరల్ ఈవెంట్స్ అని తెలుపుతూ ఎస్ఎఫ్ఐ ఇటువంటి ఫెస్ట్ నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి రాము , సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థులు అందరినీ ఏకం చేసే విధంగా ఈనెల 28 , 29 ,30 తేదీలలో గురజాడ కళాక్షేత్రంలో భగత్ సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, ప్రజానీకం , మేధావులు , అధికారులు , కళాశాల యాజమాన్యాలు సహకరించాలని కోరారు.

కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి. చిన్నబాబు, జె .రవికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి సమీరా తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడు మృతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట



చంటిబాబు (ఫైల్)

మండలంలోని మూలబొడ్డవర పంచాయతీ పరిధిలోని మరుపల్లిలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విద్యుత్తు స్తంభాన్ని ముట్టుకోవడంతో షాక్ తగిలి చంటిబాబు (4) అనే బాలుడు మృతిచెందాడు. సోమవారం ఉదయం ఆరుబయట ఆడుకుంటూ పక్కనే ఉన్న విద్యుత్తు పోల్‌ను చంటిబాబు ముట్టుకున్నాడు. వర్షానికి తడిసి ఉన్న కరెంటు స్తంభం షాక్ కొట్టింది. దీంతో అక్కడికక్కడే బాలుడు మృతిచెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. చంటిబాబు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు గౌరీష్ కోరారు.

సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

సమస్యలు పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 46 వినతులు స్వీకరించారు. బాధితుల సమస్యలు విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఎస్‌పి ఆర్. గోవిందరావు, డిసిఆర్‌బి సిఐ జె.మురళి, ఎస్‌బి సిఐలు కెకెవి.విజయనాథ్, ఎ.వి.లీలారావు, ఎస్ఐ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఓటేసి గెలిపిస్తే పింఛన్లు ఆపుతారా?

మున్సిపల్ కార్యాలయం వద్ద బాధితుల ఆందోళన

ప్రజాశక్తి-బొబ్బిలి



మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

ఎమ్మెల్యే బేబినాయనకు ఓట్లు వేసి గెలిపిస్తే తమ పింఛన్లు ఆపడం ఎంతవరకు సబబని పదో వార్డుకు చెందిన సామాజిక పింఛనుదారులు ప్రశ్నిస్తున్నారు. గొల్లపల్లిలో పదో వార్డుకు చెందిన 10 మంది పేదల పింఛన్లు నిలిపి వేయడంతో సోమవారం మున్సిపల్ కార్యాలయానికి వచ్చి ఆందోళన చేశారు. బేబినాయనపై అభిమానంతో తామంతా టిడిపికి ఓట్లు వేస్తే, కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ కాకల వెంకటరావు పింఛన్లు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని బాధితులు గొల్లపల్లి శ్రీను, డోల పార్వతి, వర్రీ ఏకాసమ్మ, డోల రాము, కర్రి పైడితల్లి వాపోయారు. తమపై కక్ష సాధింపు చర్యలకు దిగడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలుగా పింఛన్లు ఇచ్చేందుకు ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే బేబినాయన స్పందించి తమకు న్యాయం చేయాలని పింఛనుదారులు కోరుతున్నారు.

అర్హులందరికీ పింఛన్లు

అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేయాలని ఎమ్మెల్యే బేబినాయన అధికారులను ఆదేశించారు. గొల్లపల్లిలో పింఛన్లు నిలిపివేయవద్దని, అర్హత ఉన్న వారందరికీ పింఛన్లు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పేదల పింఛన్లు ఎక్కడా ఆపవద్దని సూచించారు.

పారాది కాజ్‌వేను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్



కాజ్‌వేపై నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

పారాది వద్ద వేగావతి నదిపై నిర్మించిన కాజ్‌వేను సోమవారం ఎమ్మెల్యే బేబినాయన పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వేగావతి నది ఉధృతంగా ప్రవహించడంతో కాజ్‌వే పైనుంచి నీరు ప్రవహిస్తోంది. దీంతో వాహనాలను తెర్లాం, బాడంగి మండలాల మీదుగా దారి మళ్లించారు. కాజ్‌వేను పరిశీలించిన బేబినాయన నీటి ఉధృతి తగ్గిన వెంటనే కాజ్‌వేను బాగు చేసి, వాహనాల రాకపోకలను పునరుద్ధరిస్తామని చెప్పారు.

8,9,10 తరగతి విద్యార్థులకు కౌన్సిలింగ్

హాస్టల్ విద్యార్థుల కోసం హెల్త్ డ్రైవ్ : కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విద్యార్థుల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే విధంగా వారానికి ఒక గంట పాటు కౌన్సిలింగ్ క్లాసులను నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. 8,9,10వ తరగతులు ఎంతో కీలకమని, వివిధ రకాల ఆకర్షణలను లోనయ్యే ఆ వయసులో, విద్యార్థులకు మంచి చెడులను వివరించడం ద్వారా సక్రమ మార్గంలో నడిచేటట్టు చూడాలని సూచించారు. ఎంఇఒలు, మోడల్ స్కూల్స్, కెజిబివి ప్రిన్సిపాళ్లు, వివిధ సంక్షేమ వసతి గృహాల అధికారులు, కన్వీనర్లు, హెడ్‌మాస్టర్లతో కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హాస్టళ్లలో ఎటువంటి అవాంఛిత సంఘటనలూ చోటుచేసుకోకుండా, విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇందుకోసం వారికి కౌన్సిలింగ్ నిర్వహించి విద్యార్థుల ఆలోచనలు, అభిప్రాయాలను తెలుసుకోవాలని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు ఉన్నతంగా సాగేలా, వారికి మార్గనిర్దేశం చేయాలన్నారు. విద్యా ప్రమాణాలు పెరగాలని, ప్రస్తుత విద్యాసంవత్సరంలో శతశాతం ఫలితాలను సాధించేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యంపై దష్టి పెట్టాలన్నారు.

హాస్టళ్లు, కెజిబివి, మోడల్ స్కూల్ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు, హాస్టళ్లకు గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా రోడ్లు వేయిస్తామని, చిన్నచిన్న మరమ్మతులకు నిధులను కేటాయిస్తామని ఎంఇఒలకు హామీ ఇచ్చారు. సమావేశంలో డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్, జిల్లా బిసి సంక్షేమాధికారి కె.సందీప్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా జీవిత బీమా వారోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయంలో జీవిత బీమా 68వ వార్షికోత్సవం సందర్భంగా బీమా వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తిరుమల ఆసుపత్రి ప్రముఖ వైద్యులు డాక్టర్ తిరుమల ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలసీ దారులకు మెరుగైన సేవలు అందించడంలో ఎల్ఐసి ముందంజలో ఉందన్నారు. సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎస్.జగదీష్ బాబు మాట్లాడుతూ ప్రజలకు ఆపదలో ఆర్థిక భరోసాను అందించే అనేక పాలసీలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి ఒక్కరు ఎల్ఐసి పాలసీ చేసి తమ కుటుంబానికి ఆర్థిక రక్షణ కల్పించుకోవాలని ఆయన కోరారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రెల్లి సామాజిక తరగతి ప్రజలు

5శాతం రిజర్వేషన్ కల్పించాలి

ఉత్తరాంధ్ర రెల్లి ఉప కులాల పోరాట సమితి ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్‌సి వర్గీకరణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెల్లి ఉపకులాలకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం ఉత్తరాంధ్ర రెల్లీ ఉప కులాల పోరాట సమితి ఆధ్వర్యాన నగరంలో భారీ ర్యాలీ, కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. లంకా పట్నం అంబేద్కర్ విగ్రహం నుండి పుచ్చల వీధి, పాత బస్టాండ్, గంటస్తంభం, వెంకటలక్ష్మి థియేటర్ మీదుగా కలెక్టరేట్‌కు వందలాదిగా చేరుకున్నారు. అనంతరం కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో పోరాట సమితి నాయకులు సోము రాంబాబు, అర్జి శివప్రసాద్, పొట్నూరు వెంకటరాజు, సోము. మురళీమోహన్, సోము లక్ష్మణరావు మాట్లాడుతూ రాజ్యాంగంలో ఎస్‌సిలకు కేటాయించిన రిజర్వేషన్లలో రెల్లి ఉప కులాలకు నేటి వరకు కూడా రిజర్వేషన్ల ఫలితాలు పూర్తిస్థాయిలో అందలేదని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఐదు శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతినిచ్చారు.

ఆరోగ్యశ్రీ సేవలపై ఫిర్యాదులు వస్తే చర్యలు

కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

నెట్‌వర్కు ఆస్పత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్య (ఆరోగ్యశ్రీ) సేవలపై ఫిర్యాదులు వస్తే ఆసుపత్రులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. ఐవిఆర్ఎస్. కాల్స్ లో ఫీడ్ బ్యాక్ నెగటివ్‌గా వస్తే సహించేది లేదని స్పష్టం చేసారు. సోమవారం కలక్టరేట్ సమావేశ మందిరంలో డిస్ట్రిక్ట్ డిసిప్లినరి కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో 23 నెట్‌వర్కు ఆసుపత్రులుండగా గత 8 నెలల్లో 32 ఫిర్యాదులు అందాయని, వీటిలో ఎక్కువ కేసులు లబ్దిదారునుండి డబ్బులు తీసుకొని, మళ్లీ రిఫండ్ చేశారని జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ అప్పలరాజు కలెక్టర్‌కు వివరించారు. డబ్బులు ఎందుకు తీసుకోవలసి వచ్చింది, ఎందుకు రిఫండ్ చేయవలసి వచ్చిందని కలెక్టర్ ప్రశ్నించారు. ఆసుపత్రికు వచ్చే లోపలే ప్రాథమికంగా కొన్ని పరీక్షలు చేసుకొని కొంత మొత్తం ఖర్చు చేసి వస్తున్నారని, ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించినప్పటికీ ఐవిఆర్ఎస్ కాల్స్‌లో ముందు చెల్లించిన దానినే లబ్దిదారు చెపుతున్నారని, ఆసుపత్రుల ప్రతినిధులు కలెక్టర్ కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ లబ్దిదారునికి ఇబ్బంది కలిగించే ఏ చర్యలైనా తప్పుగానే పరిగనించడం జరుగుతుందని తెలిపారు. ఆరోగ్య శ్రీ బిల్లులు జిల్లాలో సుమారు రూ.70 కోట్లు వరకు పెండింగ్ ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వెంటనే కలెక్టర్ ఎన్.టి.ఆర్ వైద్య సేవ సిఇఒతో ఫోన్ లో మాట్లాడి పెండింగ్ బకాయిలు విడుదల చేయాలనీ కలెక్టర్ కోరారు. సమావేశంలో ఆరోగ్య శ్రీ జిల్లా కోఆర్డినేటర్ అప్పలరాజు, డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర రావు, ఇంఛార్జి డిసిహెచ్ఎస్ డాక్టర్ గౌరీ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మెరకముడిదాంలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు

వైఎస్ఆర్‌కు ఘన నివాళి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని వైసిపి శ్రేణులు జిల్లాలో సోమవారం ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.



కొత్తవలసలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు



గేట్లు ఎత్తివేయడంతో దిగువకు ప్రవహిస్తున్న నీరు

మడ్డువలసకు పెరుగుతున్న ఇన్‌ఫ్లో

10,300 క్యూ సెక్కుల నీరు దిగువకు విడుదల

ప్రజాశక్తి - వంగర

తుఫాను కారణంగా విస్తారంగా వర్షాలు కురవడంతో మండలంలోని గొర్లె శ్రీరాములు నాయుడు మడ్డువలస ప్రాజెక్టుకు సువర్ణముకి, వేగావతి నదుల నుంచి సోమవారం ఉదయానికి 7,721 క్యూ సెక్కుల నీరు వచ్చి చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి ఒక్కసారిగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో నది పరివాహక గ్రామాలు ముంపునకు గురికాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఐదు గేట్లు ఎత్తి 10,300 క్యూ సెక్కుల నీటిని దిగువకు విడిచి పెడుతున్నట్లు ప్రాజెక్టు ఎఇ నితిన్ తెలిపారు. మరో 510 క్యూసెక్కుల నీటిని కుడి, ఎడమ కాలువల ద్వారా ఆయకట్టుకు విడిచిపెడుతున్నామన్నారు.

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని నిరసన

ప్రజాశక్తి-బొబ్బిలి

యుపిఎస్, జిపిఎస్‌లను రద్దు చేయాలని, పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన పట్టణంలోని గాంధీ బొమ్మ కూడలిలో, తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జెసి రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.పద్మావతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేంద్రీకృత పింఛను విధానాన్ని ప్రవేశపెట్టడం దారుణమన్నారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి అందించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు జోగినాయుడు, సిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎల్లయ్య, జిల్లా కార్యదర్శి సింహాచలం, మండల శాఖ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, లక్ష్మణరావు, ఆర్ఎన్ రాజు, బాలకృష్ణ, రామకృష్ణ, వెంకటరావు, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు

చైతన్య భారతి -లయన్స్ క్లబ్ అవార్డులు

ప్రజాశక్తి-గజపతినగరం

2024 సంవత్సరానికి గాను ఉత్తమ ఉపాధ్యాయులకు చైతన్య భారతి - లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యాన అవార్డులు అందించనున్నట్లు చైతన్య భారతి ప్రధాన కార్యదర్శి డాక్టర్ బొంతలకోటి శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల ఐదో తేదిన లయన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణలో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్య, సామాజిక సేవ , మానవ సంబంధాలు, వినూత్న ప్రయోగాలలో కృషి చేసిన ఉపాధ్యాయులకు అవార్డులు అందిస్తున్నట్లు వెల్లడించారు.

సెంచూరియన్‌లో వెబినార్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో కార్నియల్ డొనేషన్ అండ్ ఐ బ్యాంకింగ్ కన్సిడిరేషన్స్ ఫర్ ఆప్టొమెట్రిస్ట్స్ అనే అంశంపై సోమవారం వెబినార్ నిర్వహించారు. న్యూఢిల్లీ ఎయిమ్స్ ఇనిస్టిట్యూట్‌కి చెందిన డాక్టర్ సుమిత్ గ్రోవర్ ప్రసంగిచారు. డీన్ డాక్టర్ విజయ్‌బాబు, ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, ఆప్టొమెట్రీ విభాగాధిపతి సౌరజిత్ కుమార్ బెనర్జీ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎం.శ్రావణి, ఆలన, దినేష్ కుమార్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టివినాయక విగ్రహాలు పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలి

పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం మట్టివినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఆర్‌డిఒ సాయిశ్రీ, తహశీల్దార్ ఎం.శ్రీను, మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, ఎంపిడిఒ రవికుమార్, ఇతర ప్రభుత్వ అధికారులకు మట్టివినాయక విగ్రహాలను అందజేశారు. పర్యావరణ పరిరక్షణకు మట్టివినాయక విగ్రహాలను పూజించాలని ఆర్‌డిఒ సాయిశ్రీ కోరారు.

రాష్ట్రస్థాయిలో బంగారు పతకాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

తెలంగాణలోని భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం జూలూరు గ్రామంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సెంచూరియన్ బిబిఎ విద్యార్థులు 2 బంగారు, 2 వెండి పతకాలు కైవసం చేసుకున్నారు. సెంచూరియన్ బిబిఎ విద్యార్థి డి.చిరంజీవి 67 కిలోల విభాగంలో స్నాచ్ 101 కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 115 కిలోలు కలిసి మొత్తం 216 కిలోల బరువులు ఎత్తి జూనియర్ విభాగంలో స్వర్ణం, సీనియర్ విభాగంలో రజత పతకం కైవసం చేసుకున్నారు. మరో బిబిఎ విద్యార్థి వి.మౌనిక 76కిలోల కేటగిరిలో స్నాచ్‌లో 65 కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 85 కిలోలు మొత్తం 150 కిలోలు బరువులు ఎత్తి జూనియర్ విభాగంలో స్వర్ణం, సీనియర్ విభాగంలో రజత పతకం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, అసిస్టెంట్ స్పోర్ట్స్ డైరెక్టర్ నారాయణ, కోచ్ అర్జున్ వారికి అభినందనలు తెలిపారు.

రహదారిపై గోతులను పూడ్చిన పోలీసులు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి-పార్వతీపురం రాష్ట్రీయ రహదారిపై జ్యూట్ మిల్లు నుంచి పాతబొబ్బిలి మధ్యలో పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు పోలీసులు గోతులను పూడ్చారు. డిఎస్‌పి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పట్టణ సిఐ కె.సతీష్‌కుమార్, పోలీసు సిబ్బంది ట్రాక్టర్లతో మట్టి తీసుకొచ్చి, గోతులను పూడ్చారు. దీంతో ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు.. పోలీసులను అభినందిస్తున్నారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు

బాడంగి : మండల కేంద్రం బాడంగిలో ప్రధాన రహదారిపై గోతులు ఏర్పడి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న విషయం ఎమ్మెల్యే బేబినాయన దృష్టికి రావడంతో ఆయన స్పందించారు. సోమవారం ఆ రోడ్డును పరిశీలించి తన సొంత నిధులతో మరమ్మతులు చేయిస్తున్నారు. మట్టి గట్టిగా దట్టించి క్రషర్ బుగ్గి వేసి జెసిబితో చదును చేయించారు.

పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా

పలుచోట్ల సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-పూసపాటిరేగ

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలు జిల్లా అంతటా సోమవారం ఘనంగా నిర్వహించారు. **పూసపాటిరేగ మండలంలో** ఆ పార్టీ శ్రేణులు మొక్కలు నాటి, రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేసి, పేదలకు ఆహారం పంపిణీ చేశారు. పూసపాటిరేగలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఎమ్మెల్యే మాధవి కట్ చేశారు. జనసేన మండల అధ్యక్షులు జలపారి శివ, మహంతి శివ తదితరులు డొక్కా సీతమ్మ పేరిట ఏర్పాటు చేసిన ఆహారం పంపిణీ చేశారు. గోవిందపురంలో సర్పంచ్ బాలా రామలక్ష్మి, ఉప సర్పంచ్ బాలా అప్పలరాజు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పేరాపురంలో స్మార్ట్ రమేష్, చోడమ్మ అగ్రహారంలో గుడివాడ జమరాజు మొక్కలు నాటారు. టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగారాజు, జనసేన మండల నాయకులు పతివాడ శ్రీను, జలపారి శివ, జనసేన నేతలు, వీర మహిళలు, జన సైనికులు, మోగా అభిమానులు పాల్గొన్నారు.

డెంకాడ : డెంకాడ, అక్కివరం, గొడ్డిపాలెం, గుణుపూర్ గ్రామాల్లో నిర్వహించిన రక్తదాన శిబిరాలను ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ప్రారంభించి ఆయా గ్రామాల్లో మొక్కలు నాటారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటారు. ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవ రావు, టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు, మాజీ జెడ్‌పిటిసిలు పతివాడన అప్పలనారాయణ, కంది సూర్యనారాయణ, మాజీ ఎఎంసి ఛైర్మన్ చింతపల్లి రామ్మూర్తి, టిడిపి మండల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, అక్కివరం సర్పంచ్ కంది కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: మండలంలోని రెడ్డికంచేరు, చాకివలస, భోగాపురం గ్రామాలలో జరిగిన వివిధ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే లోకం మాధవి, టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, జనసేన నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు పాల్గొన్నారు. భోగాపురం జనసేన నాయకులు బొల్లు త్రినాథ్, మాతా నవీన్ రక్తదాన శిబిరం, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. భోగాపురం ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అప్పలనాయుడు, ఎపిఒ ఆదిబాబు, నాయకులు మట్టా అయ్యప్పరెడ్డి, మైలపల్లి నరసింహులు, పల్లంట్ల జగదీష్, పళ్ళ రాంబాబు, న్యాయవాది సుధాకర్, కర్రోతు శ్రీనివాసరావు, పల్లి సత్యవతి, బొడ్డ హరిబాబు, పవన్, సూరిబాబు, లోకేష్, రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: జరజాపుపేటలో సాధన యువజన సంఘం మెగా రక్తదాన శిబిరం, నేత్ర వైద్య శిబిరాలను సోమవారం ఏర్పాటు



భోగాపురం : పాఠశాల ఆవరణలో మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే మాధవి

చేసింది. కార్యక్రమంలో సాధన యువజన సంఘం అధ్యక్షులు పోలుబోతు దుర్గా ప్రసాద్, జనసేన మండల అధ్యక్షులుఎ పతివాడ అచ్చుంనాయుడు, నాయకులు పాల్గొన్నారు. సీతారామునిపేటలో ఎమ్మెల్యే మాధవి మొక్కలు నాటారు. కొండగుంపాం గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, అధికార ప్రతినిధి గేదెల రాజారావు, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్ టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

56కేక్‌లు కట్ చేసిన నాయకులు

బొబ్బిలి : కోటలో పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా 56 కేకులను కట్ చేశారు. స్థానిక జనసేన కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే బేబినాయన, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అన్న క్యాంటీన్ వద్ద పేదలకు అన్నదానం చేశారు.

వేపాడ : మండలంలోని వల్లంపూడి, దబ్బిరాజుపేట గ్రామాల్లో తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రధాన రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు.

భారీగా రక్తదానం

మెంటాడ : ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా కైలాంలో కూటమి నాయకులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మెంటాడ, చల్లపేట పిహెచ్‌సిల్లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. టిడిపి నాయకులు చలుమూరి వెంకటరావు, గొర్లె ముసలినాయుడు, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రిషివర్ధన్, నాయకులు సబ్బవరపు రాజశేఖం తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : రామభద్రపురం పిహెచ్‌సిలో జనసేన జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి ధనంజయరావు ఆధ్వర్యంలో రోగులకు పల్లు, రొట్టెలు పంపిణీ చేశారు. మహంతి వీధిలో మొక్కలు నాటారు.

విజయనగరం టౌన్ : జనసేన నాయకుడు గురాన అయ్యలు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. నియోజకవర్గంలో పలు వార్డులు , గ్రామాల్లో మొక్కలు నాటి, బర్త్ డే కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు..పేదలకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూనే

పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జనసేన బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో నగరంలోని వెంకటరామా ఆస్పత్రిలో ఐసియులో చికిత్స పొందుతున్నారు. సోమవారం డిప్యూటీ సిఎం, జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేయాలని ఆయన పట్టుబట్టారు. దీంతో డాక్టర్లు చేసేది లేక అక్కడే కేక్ ఏర్పాటు చేసి, అభిమానుల మధ్య ఆయనతో కట్ చేయించారు. ఈ సందర్భంగా అప్పలస్వామి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ గొప్ప విలువలో ఉన్న నాయకుడని, ఆయన ఇచ్చిన స్ఫూర్తి ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. తాను పార్టీలో ఎటువంటి పదవులూ ఆశించకుండా సేవ చేస్తున్నానని తెలిపారు. తన ఆరోగ్య విషయంలో ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే బేబినాయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో హాస్పిటల్ అధినేత డాక్టర్ చిట్టి రమణారావు, హార్ట్‌కేర్ వైద్యులు రెడ్డి మహేష్, జనసేన నాయకులు మనోజ్ , హరి ప్రసాద్, గణేష్, రమేష్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిలో కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు గిరడ అప్పలస్వామి

ఉన్నత పాఠశాలకు

బిసి వసతి గృహం తరలింపు

ప్రజాశక్తి - భోగాపురం

బిసి బాలుర వసతి గృహ విద్యార్థులను వర్షాల నేపథ్యంలో భోగాపురం ఉన్నత పాఠశాలకు తరలించారు. పాత భవనం మరమ్మతులు చేసే వరకు విద్యార్థులను ఇక్కడే ఉంచనున్నారు. ప్రస్తుతం ఉంటున్న వసతిగృహం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పెచ్చులు రాలిపోవడంతో పాటు వర్షానికి కారిపోతుంది. దీంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత తుపాను నేపథ్యంలో భారీ వర్షాలు పడతాయని అధికారులు భావించారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులను ఈ వసతి గృహంలో ఉంచడం సరికాదని ఉన్నతాధికారుల ఆదేశాలతో ఉన్నత పాఠశాలకు తరలించారు. హైవే లో ఉన్న వీరి పాత భవనం మరమ్మతులు చేసే వరకు ఈ పాఠశాలలోనే విద్యార్థులను కొనసాగించాలని నిర్ణయించినట్లు వసతి గృహ సంక్షేమాధికారిని శరన్మయి తెలిపారు. ప్రస్తుత పాత భవనం మరమ్మతులకు ఇంజనీరింగ్ శాఖ అధికారులతో అంచనాలు వేయిస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఐక్యంగా పనిచేయాలి

బొబ్బిలి : పట్టణాభివృద్ధికి అధికార, ప్రతిపక్షాలు కలిసికట్టుగా పని చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. పట్టణాభివృద్ధికి కూటమి ఎమ్మెల్యే బేబినాయన సూచించిన ఆదేశాలను మున్సిపల్ కౌన్సిల్ పట్టించుకోకపోవడం సరికాదని పేర్కొన్నారు. పూల్‌బాగ్ రోడ్డు బాగు చేసేందుకు నిధులు కేటాయించాలని కౌన్సిల్‌ను ఎమ్మెల్యే కోరితే, వైసిపి పాలకవర్గం కేటాయించలేదని టిడిపి కౌన్సిలర్లు ఆరోపించడం చూస్తుంటే, అభివృద్ధికి ఎలా పని చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చునని చెప్పారు.

ప్రజారోగ్యమంటే ఖాతరు లేదా?

బొబ్బిలి : ప్రజల ఆరోగ్యమంటే మున్సిపల్ అధికారులకు ఖాతరు లేదని మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు రియాజ్ ఖాన్, వైసిపి 30వ వార్డు ఇన్‌ఛార్జి మనోజ్ కుమార్ అన్నారు. పట్టణంలో పోలీసుస్టేషన్ ఎదురుగా ఉన్న మున్సిపల్ ట్యాంకును సోమవారం వారు పరిశీలించారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే ట్యాంకును ప్రతి 100 రోజులకు ఒకసారి శుభ్రం చేయాల్సి ఉన్నప్పటికీ శుభ్రం చేయడం లేదన్నారు. దీంతో ట్యాంకు లోపల నాచు పట్టి బురదమయంగా మారిందన్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే ట్యాంకును శుభ్రం చేయడం లేదన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

శృంగవరపుకోట : పట్టణంలోని ప్రయివేటు కళ్యాణ మండపంలో లక్ష్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి డైట్ ప్రిన్సిపల్ ఎన్.తిరుపతినాయుడు, సిఎంఒ వి.ఆదినారాయణ, డిసిఇబి సెక్రటరీ టి.సన్యాసిరాజు, పెదనడిపల్లి హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. లక్ష్య ఫౌండేషన్ నిర్వాహకులు కర్రి పవిత్ర లహరి, మండ సత్య సాయితి, ఏడువాక గాయత్రి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యం

బొబ్బిలి : చిరు ధాన్యాలతో ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు జి.సాయికుమార్, ఐసిడిఎస్ సిడిపిఒ జె.విజయలక్ష్మి అన్నారు. ఇందిరమ్మ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్లో సోమవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు ఆరోగ్యంగా ఉండేందుకు చిరుధాన్యాలతో చేసిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ టి.పార్వతి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు అరుణ, నిర్మల పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

రేగిడి : గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని తహశీల్దార్ డి. ఎల్లారావు సూచించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ముటేషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. వరదలకు నాగావళి పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. డిటి సత్యనారా యణ, రమేష్, విఆర్‌ఒ సత్యనారాయణ, దొర పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- డెంకాడ

తుపాను నేపథ్యంలో గ్రామాల్లో వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో గ్రామంలో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామ, మండల స్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. గ్రామంలో ప్రతి ఇంటిని సర్వే చేసి వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు మాట్లాడుతూ గ్రామాల్లో వర్షపు నీరు, వాడుక నీరు కాలువల్లో నిల్వ ఉండకుండా చూడాలన్నారు. నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు చేరే ప్రమాదం ఉందని వాటి ద్వారా వ్యాధులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. సమావేశంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మునాయుడు, ఎంపిడిఒ డిడి స్వరూపరాణి, పంచాయతీరాజ్ జెఇ ఎం.సురేష్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ బి.ప్రవీణ్ శంకర్ జగన్నాథం, మోపాడ, డెంకాడ పిహెచ్‌సి వైద్యాధికారులు ఎం.శివరామకృష్ణ, యోగిత బాల, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-బొండపల్లి

స్థానిక పిహెచ్‌సిలో నేత్రదానంపై అవగాహన వాల్‌పోస్టర్‌ను సోమవారం వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ అసిస్టెంట్ కె.శ్రీనివాస రావు, హెల్త్ సూపర్వైజర్ ఎస్.ఎ.బాషా పాల్గొన్నారు. అంబటివలస గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించారు. ఆరుగురు జ్వరపీడితులను గుర్తించి ఆర్‌డిటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ రాధాకుమారి, హెల్త్ అసిస్టెంట్ బి.విశ్వేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పి ఎం .రాధ, ఎంఎన్ఎం సహారా బేగం పాల్గొన్నారు.

పుస్తెల తాడు ఎత్తికెళ్లిన దొంగలు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని ఉణుకూరు - కాగితాపల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారిలో ఉణుకూరు గ్రామానికి చెందిన మజ్జి భారతి సోమవారం పొలం పనులకు వెళ్తున్న తరుణంలో ద్విచక్ర వాహనంపై ఇద్దరు వచ్చి మెడలో ఉన్న పుస్తెల తాడు లాక్కెళ్లినట్లు సిఐ ఉపేంద్రరావు తెలిపారు. చోరీకి పాల్పడిన సమయంలో ఆమె చేతిలో కొడవలి ఉండటంతో పెనుగులాటలో దుండగులకు స్వల్ప గాయాలయ్యాయని చెప్పారు. భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ రాజారావు కేసు నమోదు చేశారన్నారు. విచారణ చేపట్టి చైన్ స్నాచర్‌ను పట్టుకుంటామని సిఐ తెలిపారు.

విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్న వ్యాన్

ప్రజాశక్తి-విజయనగరం కోట

విశాఖ నుంచి విజయనగరానికి ఇంటీరియల్ డిజైన్ మెటీరియల్‌తో సోమవారం సాయంత్రం వస్తున్న వ్యాన్ సంతకాల వంతెన వద్ద విద్యుత్తు స్తంభాన్ని ఢీకొంది. వంతెనపైకి వస్తున్న క్రమంలో ఎక్స్‌లేటర్ పెరిగిపోవడంతో అదుపు తప్పిన వ్యాన్‌ను డ్రైవర్ మచ్చి రాము చాకచాక్యం వ్యవహరించి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టించాడు. దీంతో వెనక్కి వచ్చిన వ్యాన్‌ను ఆపడానికి ప్రయత్నించి డివైడర్ ఎక్కించాడు. ఈ ఘటనలో డ్రైవర్ చిన్న చిన్న గాయాలతో సురక్షితంగా బయటపడ్డాడు. ఎవరికీ ఎటువంటి ప్రమాదమూ జరగకపోవడంతో అక్కడున్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

లీజు సొమ్ము చెల్లించాలి

ప్రజాశక్తి - వంగర

మడ్డువలస జలాశయంలో చేపల వేట చేసిన కొట్టిశ శ్రీ సీతారామ మత్స్యకార సొసైటీ నుంచి ప్రభుత్వానికి చెల్లించవలసిన 1431, 1432, 1433, 1434 ఫసలీలకు సంబంధించిన రూ.57.74 లక్షలను వెంటనే చెల్లించాలని మత్స్యశాఖ రాజాం అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్‌వివి ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మత్స్యకారులతో మగ్గూరులో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ మత్స్యశాఖ సొసైటీలో 570 మంది సభ్యులు ఉన్నారని వీరికి సంబంధించిన డేటా కంప్యూటరీకరణ చేస్తున్నామని వెల్లడిం చారు.

అధ్యక్షుడు కాలపరిమితి ముగింపు

మడ్డువలస జలాశయంలో చేపల వేట చేసిన కొట్టిస శ్రీ సీతారామ మత్స్యకార సొసైటీకు ఇంతవరకు అధ్యక్షుడిగా ఉన్న లక్ష్మీనారాయణ పదవీకాలం ముగిసిందని వెల్లడించారు. ఈ జలాశయంలో చేపల వేటకు సంబంధించిన బాధ్యతలను మత్స్యశాఖ జిల్లా అధికారి తమకు అప్పగించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో విఎస్ఎలు చైతన్య శాస్త్రి, రఘురాం, శివ, మత్స్యకారులు పాల్గొన్నారు.

నాగావళికి వరద గట్టు నిర్మించాలి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి గ్రామం నుంచి తులివాడ వరకు నాగావళి నదికి రెండున్నర కిలోమీటర్ల మేర వరద గట్లు నిర్మించాలని టిడిపి మండల సీనియర్ నాయకులు నారు జనార్ధన రావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నాగావళి నది వరద గట్టును పరిశీలించారు. 140 ఏళ్ల నాటి బ్రిటిష్ వరద గట్లు 1990లో వచ్చిన తుపానుకు గండి ఏర్పడిందని అప్పటి నుంచి వరదగట్లు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. సాయన్న ఛానల్, చిట్టగెడ్డ, గోపాలరావు కాలువలతో పాటు పిల్ల కాలువలు రూపురేఖలు మారే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి వరద గట్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీకి పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

ఆరు పోలీసు స్టేషన్ల పరిధిలో 10 కేసులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలోని నెల్లిమర్ల, పూసపాటిరేగ, డెంకాడ, చీపురుపల్లి, ఆంధ్ర, బొబ్బిలి పోలీసు స్టేషన్ల పరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేసిన బృందంలోని చీపురుపల్లి మండలం పేరిపి గ్రామానికి చెందిన ఎలక గణేష్ (25) అరెస్టు చేసి, అతని నుండి రూ. 1.50 లక్షల విలువైన రాగి, అల్యూమినియం దిమ్మలను రికవరీ చేసినట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నెల్లిమర్ల మండలం కొండవెలగాడ, కొత్తపేట, గుషిని, పారసాం, చంద్రంపేట గ్రామాల్లో వ్యవసాయ పొలాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు ఎలక్ట్రికల్ డిపార్టుమెంటు ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. పూసపాటిరేగ, డెంకాడ, చీపురుపల్లి, ఆంధ్ర, బొబ్బిలి పోలీసు స్టేషన్ల పరిధిలో కూడా ఇదే తరహా నేరాలు జరగడంతో స్పందించిన ఎస్‌పి సిసిఎస్ సిఐ ఎ.సత్యన్నారాయణ, భోగాపురం సిఐ జి.రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. నెల్లిమర్ల ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో కలిసి సోమవారం ఉదయం మిమ్స్ ఆసుపత్రి సమీపంలో వాహన తనిఖీలు చేపడుతుండగా, గుర్ల వైపు నుండి విజయనగరం వైపు వస్తున్న ఒక ఆటోలో వెనుకన కూర్చున్న ఒక వ్యక్తి, పోలీసు తనిఖీలను చూసి, ఆటో దిగి, ఒక మూటతో పారిపోతుండగా, పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారణ చేసారు. విచారణలో తనతో పాటు తన బంధువులైన పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన సారికి దుర్గారావు, సారికి సురేష్ మరియు ముంగిన అజిత్ కుమార్ కలిసి ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేసినట్లు అంగీకరించాడు. మిగిలిన నిందితులు కూడా పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు పోలీసులకు పట్టుబడ్డారని, ప్రస్తుతం వారు కూడా రిమాండ్‌లో ఉన్నారని ఎస్‌పి తెలిపారు. కేసులో క్రియాశీలకంగా పని చేసిన సిసిఎస్ సిఐ ఎ.సత్యన్నారాయణ, భోగాపురం సిఐ జి.రామకృష్ణ, నెల్లిమర్ల ఎస్ఐ రామ గణేష్, సిసిఎస్ పోలీసు సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.